

# టేకిట్ ఈజీ!! - 3





శ్రీనివాస ఫణికుమార్ డొక్కా

# క్రూజు వ్రత పూజా విధానము..

ఓ శనివారం మజ్జాన్నం శాస్త్రోక్తంగా భోంచేసి, సోఫా ఎక్కి, మావిడిటెంక గ్రోలుతూ, చేతిమీద పడ్డ రసం సోఫాకు రాసేసి, సోఫా మీద పడ్డ రసం అలాగే ఉణ్ణిచ్చేసి, పైకెక్కి పక్కమీద పడుక్కోవడవా, లేక ఇక్కడే సోఫామీద కాళ్ళటుగా చాపేసి గుర్రెట్టేయడవా అని తేల్చుకోలేకపోతున్న సంధి సమయంలో ఓ సౌండు వినిపించింది "**నాన్నా**" అని.

ఇంత క్లోజప్పులో వినిపిస్తోందంటే పక్కవాడి కూతురు కాదు, నాకూతురే అయ్యుంటుంది, నన్నే అయ్యుంటుందని డిసైడయిపోయి, తల తప్పే ఓపిక లేక "**ఆ, ఏవిటే..**" అన్నాను ఆవులిస్తూ.

"**క్రూజ్**" అంటే ఏవిటి నాన్నా? అంది ఆ సౌండు.

"**ఓ..క్రూజా, ఆవిడ ఒక దేవతా స్త్రీ. పూర్తి పేరు పెనెలోపే క్రూజ్. ఆవిడ చారెడేసి పెదాలతో, చాక్లెట్ల లాంటి కళ్ళతో, ముద్దు ముద్దు మాటలతో..**" అని కంటిన్యూ అయిపోతుంటే నా మాటకి అడ్డు తగిలి,

"**ఇక్కడ ఆడపిల్ల బొమ్మ లేదేంటి మరి?**" అంది ఓ పుస్తకం చూపిస్తూ.

నేను ఇంకా తల తిప్పకుండానే "**ఓ అయితే టాం క్రూజ్ అన్న మాట. వాడొక గంధర్వ రాజు. విమానాల్లో తిరుగుతూ వుంటాడు. వాణ్ణి చూడాగానే ఆడాళ్ళు మెలికెలు తిరిగిపోతూ "డోంట్ కాల్ మీ...డోంట్ బీ మేడ్..ఇన్ ఫోర్ పీపుల్ ఓ కింగూ, డోంట్ డైల్యూట్ మీ ఓ కింగూ..**" అని "**గోల్డెన్ బ్యూటీ" సినిమా లో పాట పాడతారన్నమాట.** " అని విపులీకరించాను.

దానికొళ్ళు మండింది. "**ఇక్కడ మనిషి బొమ్మ లేదు, పేద్ద ఓడ బొమ్మ వుంది**" అని అరిచింది విసుగ్గా.

ఇంక లాభం లేదని అతి ప్రయత్నం మీద తల తిప్పి చూసాను. నిజంగానే అక్కడ ఓ ఊరంత ఓడ వుంది. వెలిగిపోతోంది. అప్పుడు మనకి వెలిగింది. "**ఓ....ఇదా...ఈ క్రూజా...క్రూజంటే బలిసిన వాళ్ళు పడవెక్కి సముద్రంలోకి పోయి, వాళ్ళకి ఎంత బలిసిందో అన్ని డబ్బులు, సంచీల్లో తీసుకెళ్ళి, సముద్రంలో పోసేసి, వచ్చేస్తారన్నమాట** " అన్నాను సావకాశంగా సైడుకి జార్లాబడుతూ.

అదోమాటు నన్ను అనుమానంగా చూసి, "**మరి మనకెప్పుడు బలుస్తుంది నాన్నా?**" అడిగింది బెంగగా.

నాకు మండింది. "**ఒసేయ్, నీకు వీణ క్లాసుకి టైమైంది ఫో, వెళ్ళి అమ్మని దింపమను**" అనేసి దాన్ని తోలేసాను.

వాళ్ళమ్మ దాన్ని దింపేసి వచ్చింది. వచ్చి వంటింట్లో కెళ్ళింది. వంటింట్లో గిన్నెలు సద్దుతోందో, విరక్కొడుతోందో అర్థం కాలేదు. ***ధమాల్ ధమాల్*** మని శబ్దాలు మాత్రం వస్తున్నాయి, టిప్పు సుల్తాను సైనికులు యుద్ధానికి ప్రిపేర్ అవుతున్నట్టుగా. నామనస్సెందుకో కీడు శంకించింది.

అయినా "ఎన్ని యుద్ధాలు చూళ్ళేదూ, ఈ సోఫా సింహాసనంనుంచి నన్ను లేపే మగవాడు, ఆడవాడు పుట్టలేదు ఇంకా, ఈ హా హా " అనుకుని కళ్ళు మూసుకున్నాను మత్తుగా.

"అవును, అలాగే తిని, పడుకోండి. ఇదే మనకి జీవితం. ఓ వెకేషనూ లేదు ఓ ఏవగేషనూ లేదు, ఎంతసేపూ ఏం చేస్తావు, ఏం పెడతావు, బండ పచ్చడా ?, బెల్లం పెట్టి కూరా? ఇదే దిక్కుమాలిన గోల." మా ఆడ టిప్పుసుల్తాను ఎక్కడా ఆగేట్టు లేదు.

డిష్ లన్నీ ఢిషూం ఢిషూం అంటూ మధ్యలో అర్కెస్ట్రా సహకారం ఇస్తున్నాయి. "ఏవిటే?" అన్నాను మత్తుగా.

"నా బూడిద. ఏవిటేవిటి? చక్కగా అందరూ సెలవల్లో వేకేషన్లకి పోతారు. మనవూ వున్నాం. ఎంత సేపూ నిద్రా, తిండీ. నేను వంటలక్కలా అన్నీ చేసి అందించడం, మీరు తిని తొంగోవడం. విసుగొచ్చేస్తోంది" అని చిన్న గేప్ ఇచ్చి ఫోనులో ఒక ఫొటో తెచ్చి చూపిస్తూ "చూడండి..." అంది.

దాన్లో చేమదుంపకి కోటేసినట్టుగా వున్న ఒక మగవాడు, జంతికకి గౌనేసినట్టున్న ఒక ఆడవాడు చేతులు సైడుకి చాపి, పడవ చివరన నించుని ఆత్మహత్య చేసుకుంటున్నారు.

"వీళ్ళెవరే?" అన్నాను అనుమానంగా చూస్తూ.

"మన సిద్ధాంతి గారూ, పెళ్ళాం" అంది బుంగ మూతి పెట్టి.

"అయ్యో పాపం, వాళ్ళెప్పుడు పోయారే?" అన్నాను ఖంగారుగా.

"వాళ్ళు ఆత్మహత్య చేసుకునేప్పటి ఫొటో కాదు అది, క్రూజు కెళ్ళినప్పుడు సరదగా తీయించుకున్న ఫొటో." అంది బుంగ మూతి కంటిన్యూ చేస్తూ.

"బావుంది, అయినా ఆత్మహత్య చేసుకునే సరదా ఏవిటే" అన్నాను అర్థంకాక.

"చంపేస్తాను. చూడండి, ఆఖరికి సిద్ధాంతి గారూ కూడా వెళ్ళొచ్చేసారు క్రూజ్ కి..."అంది మరో వన్ మినిట్ లో కురిసే మేఘంలా మొహవెట్టి.

"వెళ్తారే,ఆయనకేవిటి. పుడితే బారసాల, చస్తే తద్దినం, నెలతిరక్కుండా మాసికం, ఏటా సంవత్సరికం. నెల నెలా పూజలూ, వ్రతాలు. నిచ్చ పంట. మాకు నెలకోసారే జీతం. ఆయనది జీవనది, రోజూ రాబడే" అన్నాను వివరిస్తూ.

"అవన్నీ నాకు తెలీదు. వచ్చే నెలలో చిన్న దాని పుట్టిన్రోజుకి మనవంతా క్రూజ్ కి వెడూన్నాం. దట్సాల్ దటీజ్ ఫైనల్." అనేసింది.

"ఏవిటి సముద్రంలో వెకేషనా? అది కాదే, భూమ్మీద కాలో చెయ్యో విరిగినా పాక్కుంటూ బతికేయచ్చు. విమానంలో పోతే డైరెక్ట్ స్వర్గమే, బూడిద కూడా మిగల్దు. ఈ సముద్రం అలా కాదే. మునిగావంటే, చిక్కుడు గింజల్లా నాని, ఉబ్బి, ఏ సొరచేపో రోజుకో పార్టు చొప్పున పప్పులోకీ, పుసులులోకీ నంచుకుంటుందే బాబూ, చెబితే వినవే, మా అమ్మ కదూ.." అన్నాను బతిమాలుతూ.

ఇంతలో చిన్నది లేచి కుయ్యి కుయ్యి మంది పైనించి."నో, నథింగ్ డూయింగ్, క్రూజ్ ఈజ్ ఫైనల్" అనేసి మేడెక్కేసింది మా లేడీసు.

ఎంకి పెళ్ళి రంగి ఛావు కొచ్చిందనట్టు అసలీ సిద్ధాంతి గారు క్రూజు కెందుకు పోవలె? పోయితిరి పో. చేతులు బార్లా జాపి ఫొటోలేల దిగవలె? దిగితిరి పో. ఫేసు బుక్కులో ఏల పెట్టవలె. అది మా లేడీసు కంట ఏల పడవలె. హత విధీ (అంటే ఏవిటి?) శృత కీర్తీ (అవిడెవరు?) ఇలా వగచి, పడుక్కుని లేచి, ప్రసాదు గాడికి ఫోను చేసాను. వొరేయ్, క్రూజ్ వ్రత విధానం చెప్పరా అని.

వాడు చెప్పాడు. " అన్ని కోరికలను తీర్చే ఈ వ్రతాన్ని సముద్ర గుప్త మహరాజు వాస్కోడిగామా కు వివరించెను. అతను ఆవ్రతమాచరించి ఎన్నో ఫలితములను బడసెను. ఆనక ఆంగ్లేయులాచరించి మొత్తం ప్రపంచమును బడసిరి. పిమ్మట అమెరికన్లు ఆచరించుచు నేటి వరకు ఫలితములను బడుస్తూనే వున్నారు. తొలుత కొలంబసు అబ్రహేముకు తెలిపెను. అతగాడు హేరీకు, హేరీ రోనాల్డుకు, రోనాల్డు బిల్లు కు, బిల్లు ద్వారా బాబు గారికి, వారి ద్వారా తెలుగువారందరికీ తెలిసెను. నాకు వెంకట్ గాడు చెప్పెను. నేను సిద్ధాంతిగారి కి చెప్పాను. ఆయన ఎవరికీ చెప్పకుండా క్రూజు కెళ్ళొచ్చెను.." అని ఆగాడు ఆయాస పడుతూ.

"అది సరేరా,విధానం చెప్పు, విధానం" అన్నాను ఆసక్తిగా.

వాడు మొదలెట్టాడు "ముందుగా ఏ దీవికి వెళ్ళాలో నిర్ణయించుకుని, వెబ్ సైట్లు వెతికి టికెట్లు కోయించుకోవలెను. మీ గదినించి సముద్రం కనపడాలా, లేక గది బైటికొచ్చి బాల్కనీలోంచి మీరు అర్ఘ్యాలు, తర్పణాలు ఇచ్చే ఫెసిలిటీ కావాలా అనేదాన్ని బట్టి మీ రేటు వాయింపుడు నిర్ణయింపబడును. పాసుపోర్టులు తీసుకు వెళ్ళనిచో మిమ్మల్ని సముద్రంలో వదిలేసే ప్రమాదము కలదు. ఇంకనూ నానా రకములైన దుస్తులు తీసుకు వెళ్ళి, ధరించ వలెను. దీవులలో సముద్ర గర్భ దర్శనము, మత్స్య లోక విహారము వంటి సౌకర్యములుండును. మిమ్ములను 24 గంటలు బలి పశువులకు మల్లే మేపుదురు. టీ, కాఫీలు ఏరులై పారును. కేకులు కోకొల్లలుగా దొరుకును. కనీసము 10 దేశాల తిండి, రకరాల నూడుల్సు మప్పుదురు".

ఈ చివరి వాక్యాలు విన్న తరువాత ఈ వ్రతం ఆచరించి తీరాలని నిర్ణయించుకుని ఫోను కట్ చేసా. ఓ నెల విష్ణు చక్రంలా గిర్రున తిరిగిపోయింది. క్రూజు వ్రతం చేసే రోజొచ్చేసింది. ఓ ఎనిమిది గంటలు నావి కావనుకుని సముద్రం ఒడ్డుదాకా డ్రైవింగు చేసి, మా శాల్తీలని ఓడలో కూలేసాను. వెళ్ళడంతోటే పెద్ద పిల్ల స్విమ్మింగ్ పూల్లో కాపరం పెట్టింది. చిన్నది అక్కతోటి జాయనైపోయింది. మేమిద్దరం లాగులేసుకుని పిచ్చోళ్ళలా కాళ్ళుపీకేదాక ఓడంతా సర్వే చేసొచ్చాము. తల తిప్పేసరికల్లా నాలుగేసి ఫొటోలు తీసేస్తున్నారు క్రూజులో. భలే సరదా వేసిపోయింది. మంగోలియా నూడుల్సు, కాంబోడియా ఫ్రైడ్ రైసూ,కొలంబియా కాఫీసూ, 10 రకాల ఫ్రెంచి ఫ్రైసూ, పూటుగా లాగించేస్తున్నాను. కళ్ళు సగవే తెరుగుకుంటున్నాయి.

మర్నాడు సాయంత్రం ఆత్మహత్య ఫొటో కోసం పేద్దలైను. చేసేది లేక నించున్నాము. మా వంతు వచ్చేసరికి మూడైంది. వాడు క్రేన్లో ఎక్కి గాల్లో తేలుతూ తీస్తున్నాడు. మేము చేతులు చాపి నించున్నాము.

"సార్, ఆవిడ మీ ఆవిడేనా?" అడిగాడు వాడు.

"లేదురా, పక్కింటాడి పెళ్ళాణ్ణి వేసుకొచ్చాను, దరిద్రుడా, ఇది మా శాల్తీయే.." అని,

"ఒసేయ్, తీయ్, చూపించు " అన్నాను విలాసంగా.

"ఏవిటండీ?" అంది మా శాల్తీ ఖంగారుగా.

"ఏవిటేవిటే, నీ మంగళ సూత్రం చూపించు వెధవకి, అప్పుడు నమ్ముతాడు.." అన్నాను చిరాగ్గా.

"అయ్యో, అది ఇంట్లో చిన్న బీరువాలో పెట్టేసానండీ పోతుందని.." అంది అమాయకంగా.

"మంగళ సూత్రాన్ని చిన్న బీరువాలోను, మొగుడు వెధవని పెద్ద షోకేస్ లోనూ పెట్టేయవే. శనొదిలిపోతుంది.." అంటూంటే, వాడు మళ్ళీ అడిగాడు

"సార్ ఆవిడ మీ ఆవిడేనా?" అని.

నేను చెప్పు తియ్య బోతుంటే క్లారిఫై చేసాడు "మీ ఆవిడైతే అంత దూరంగా నించున్నారేం?. చక్కగా వెనకాలే నించుని ఆవిడ చేతుల మీద చేతులు చాపండి. ఆవిడ భుజాల మీద బుర్ర పెట్టండి,వుంటే. కాస్త నవ్వండి సార్.." అంటూ ఫొటోలు నొక్కేసాడు.

ఆనక కాసేపటికి మా శాల్తీ అంది "**ఏవండీ కడుపులో తిప్పుతోందండీ, అదోలా వుంది**" అని.

"**అందుకే చెప్పాను అంత దగ్గరిగా నించోద్దే అని. ఎంత ఫోటో అయితే మాత్రం, అలా మీద పడిపోవాలా, ఇప్పుడు చూడు ఏవయిందో..**" అన్నాను ఆందోళనగా.

"**అబ్బ ఊరుకుందురూ, ఎంత సేపూ అదే రంధి. ఈ తిప్పుడు ఆ తిప్పుడు కాదు. సీ సిక్ నెస్. రెండు మాత్తర్లేసుకుంటే పోతుంది**" అంది.

"**ఏవిటీ? ప్రాణమా?**" అన్నాను అనుమానంగా.

"**అబ్బ, ఈ సిక్ నెస్ కి మాత్తర్లు తెచ్చాను, పదండి రూముకి పోయి వేసుకునొద్దాం**" అని లాక్కుపోయింది.

ఎందుకేనా మంచిదని తను మాత్తర్లేసుకొచ్చేదాకా రూము బయటే వున్నాను. ఎటొచ్చి ఎటొస్తుందో ఎవరూ చెప్పలేముకదా, రోజులలావున్నాయి మరి. ఆనక జూద శాలలో అడుగెట్టి కసా కసా కసితీరా క్రెడిట్ కార్డు గోకేసి, వళ్ళూ పైనా తెలియకుండా ఆడేసాము. పిల్లలు ట్విలైట్ కేర్, డే కేర్, ఆఫ్టర్నూన్ కేర్, ఈవెనింగ్ కేర్, నైట్ కేర్, మిడ్ నైట్ కేర్ లలో జాయినైపోయారు. అంచేత కేర్ కేర్ మనడం మానేసి ఆడేసుకుంటోంది చిన్నది. వాళ్ళ లోకంలో వాళ్ళున్నారు. చూసి చాలా సేపయింది కాబట్టి వుండే వుంటారు. మళ్ళా అందరూ కలసి డిన్నర్లూ, కోట్లేసుకుని లైన్లలో నుంచుని, ప్రతీ ఫుల్ ఏంగిల్ లోనూ, అర ఏంగిల్ లోను ఓ వెయ్యి ఫొటోలు గట్రా తీయించుకుని దీవిలో దిగబడ్డాం. దిగంగానే పిల్లల్ని ఒకరెత్తేసుకున్నారు. ఇద్దరు ఆడాళ్ళొచ్చి మమ్మల్ని పక్కనే పడుకోబెట్టేసి తైల మర్దనం చేసేసి తలో వందా ఊడుచుకు పోయారు. ఆనక చిన్న మర పడవ ఎక్కించి మరో మూడొందలు గుంజేసారు. గాలిపటానికి కట్టి ఆకాశంలోకి ఎగరేసి, ఆరొందలు వడికేసి, అప్పుడు కిందకి దింపారు. జీపులో ఊరు తిప్పి మరో మూడొందలు ముంచేసారు. ఇలా ఓ రోజంతా తిప్పేసి, తిరిగి ఓడలో పడేసారు. వళ్ళు తూలిపోతోంది. తినేందుకు కడుపులోనే కాదు, నోట్లో కూడా ఖాళీ లేదు.

అలా తినేస్తున్నాం. పిల్లలు ఉభయ చరాల్లాగా ఎక్కువసేపు నీళ్ళలో నానుతూ, అప్పుడప్పుడూ నేలమీదకొస్తునారు. కితం జెన్మలో కప్పలేమో.

నౌకా ప్రవేశం చేస్తూంటే మా ఆవిడంది "**ఏవండీ, ఓ మందు సీసా కొందావండీ..**" అని.

నాకు గుండె ఆగినంత పనయింది. "**ఇదెప్పుడు మొదలెట్టావే?**" అన్నాను ఆందోళనగా.

"**ఛీ నాకు కాదండీ, మా బాసు వెధవకి**" అంది నవ్వుతూ.

"**బావుందే. మూల విరాట్టుకి పూజలు లేవు, ఉత్సవ విగ్రహానికి ఊరేగింపులనీ..**" అన్నాను అసూయగా.

"**మీకెందుకండీ, పోనీ అలాగే కొంటాలెండి. మీరు తాగుతారా?**" అంది కళ్ళు పెద్దవి చేసుకుని.

"**ఛీ,ఛీ మా వంశం ఎలాటిది?**" అన్నాను కోపంగా.

"**ఇప్పుడు ఆ డీటెయిల్సన్నీ ఎందుకండీ? తాగుతారా, తాగరా..**" అంది ఫైనల్ గా.

"**ఛస్తే తాగను,అందులోనూ పబ్లిక్కుగానా..**" అన్నాను కోపంగా.

"**మరి అందుకే, మా బాసుగాడికి కొందామని. ఎంత సేపూ పిల్ల చచ్చిన కోతిలా మొహం వేలాడేసుకుని పడుంటాడు వాడి ఆఫీసు రూం లో. ఇలాంటివేవో అప్పుడప్పుడూ పడేస్తూ వుంటే మనకి ఓయేడు కాపోయినా మరోయేడు ప్రమోషనూ, అధమపక్షం రెండు పర్సెంటు రైజూ పడేస్తాడు, తెరియుమా?**" అని తమిళంలో ముగించింది.

"**తెరిసి పోయిందిలెండీ, అలాక్కానివ్వండి**" అనేసి, ఎప్పుడూ లేనిది నా స్వహస్తాలతో ఓ మందు సీసా కొని, ముట్టుకుని, సంచీలో పెట్టుకుని లోపలికట్టుకొచ్చాను.

మళ్ళీ బలి పశువు డిన్నర్లూ, కోట్లేసుకుని కోటి ఫొటోలు గట్రా అయ్యాకా మర్నాటికి తెచ్చి ఒడ్డుమీద పడేసాడు. మళ్ళీ ఈసురో మని కారీడ్చుకుంటూ ఇల్లు జేరేసరికి మొహాలు టేన్ అయిపోయి, పైన ఒక రంగు, బంపరుకి ఇంకోరంగూ వేసిన కార్లలా తయారయ్యాము. లోపలికి అడుగెట్టేసరికల్లా క్రెడిట్ కార్డు వాడి ఫోను. ఎత్తాను.

**"సార్, మీదీ, మాదీ కలిపి మొత్త ఎనిమిదివేల డాలర్లయింది మీ క్రెడిట్ కార్డు బిల్లు"** అన్నాడు సంతోషంగా.

**" నీ బొడ్డు పొక్క, నీదెందుక్కలిపావురా, దరిద్రుడా..?"** అన్నాను కోపంగా.

**"మరి మేము మీకిచ్చిన క్రెడిట్ లిమిట్ మీరు గాలిపటంతో గాల్లో తేలే సరికే, గాల్లోకలిసిపోయింది. ఆనక మా లిమిట్ కూడా కలిపితేనే మిమ్మల్ని కింద పెట్టారు, మీ వెకేషన్ పూర్తైంది, ఇ..హి...హి.."** అన్నాడు కులుకుతూ.

**"కులికింది చాలు, మరి ముందే ఎందుకు ఫోను చెయ్యలేదు?"** అన్నాను చిరాగ్గా.

**"అంటే మీరు సముద్రం మీద వున్నప్పుడు చేసాం, మా కాల్ సముద్రంలో కలిసిపోయింది, దీవి లో ఉన్నప్పుడు సిగ్నల్ రాలేదన్నమాట, ఇ..హి..హి"** అన్నాడు మళ్ళీ కులుకుతూ.

**"సర్లే, కులికి ఛావకు. రేపు కడతాలే.."** అనేసి ఏడుపుమొహవెట్టుకుని ఫోను ఆపుచేసా.

అప్పులన్నీ తీర్చి, ఆ క్రూజు వ్రతం నుంచి, సముద్రయానం నించీ తేరుకుని ఒడ్డునపడడానికి నాలుగు నెలలు పట్టింది. ఇంటినిండా ఎక్కడ చూసినా మా దిక్కుమాలిన ఫొటోలే. కాఫీ కప్పుల మీద, తినే పళ్ళేల మీద, ఫ్రిజ్జు మీద, మైక్రోవేవు మీద, మహా ప్రభో అడక్కండి. నావల్ల కాలేదు. ఈ వ్రతం చేసుకోమని సలహా ఇచ్చిన ప్రసాద్ గాణ్ణి రేపో మాపో ఛంపేద్దామని డిసైడు అయిపోతున్న తరుణంలో, మా పెద్ద శాల్తీ వచ్చి

**"నాన్నా, క్రూజు చాలా ఫన్ గా వుంది, మళ్ళీ వెళ్దాం నాన్నా"** అంది కాస్త దూరంగా నిల్చుని.

**"కదా, నేనూ ఎగ్జాట్లీ అదే అనుక్కుంటున్నానన్నమాట, ఓ మాటు ఇలారా.."** అంటూ రెండు చేతులూ పక్కకి చాపి, హిరణ్య కశిపుడిలా దానిమీదకి దూకాను.

అది ప్రహ్లాదుడిలా పారిపోయింది.

## (వచ్చే సంచిక దాకా లైట్ తీస్కోండి!)

POST YOUR COMMENTS